క్లుప్తంగా

అశ్రద్ధ చేస్తే క్షయ ప్రాణాంతకం

పెరవలి: అంటువ్యాధి అయిన క్షయను అశ్రద్ధ చేస్తే ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని కానూరు పీహెచ్‌సీ వైద్యాధికారి పి.తేజశ్రీ హెచ్చరించారు. క్షయవ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా కానూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ, సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధి నిర్ధారణ అయితే డాట్ పద్ధతిలో రెండు రకాల చికిత్సా విధానాల ద్వారా వ్యాధిని తగ్గించ వచ్చన్నారు. కార్యక్రమంలో ఆశాజ్యోతి, సూపర్‌వైజర్లు ఏజే సందాని, సచ్చేంద్ర కుమార్, దుర్గా ప్రసాద్, రాజశేఖర్, ఏడుకొండలు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

కొవ్వూరు: రేషన్ డీలర్లకు సరుకు దిగుమతి చార్జీలు చెల్లించాలన్న హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ జిల్లా డీలర్ల సంఘం నాయకులు మంగళవారం జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి ప్రసాదరావును రాజమహేంద్రవరంలో కలసి వినతిపత్రం అందజేశారు. అలాగే పౌరసరఫరాల శాఖ డీఎం త్రినాథ్‌కు కూడా వారు వినతిపత్రం అందజేశారు. జిల్లా రేషన్ డీలర్ల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, జిల్లా అధ్యక్షుడు సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మానేపల్లి వెంకటేశ్వరరావు, రాష్ట్ర సమాచార కార్యదర్శి పృద్వీరాజ్, వివిధ మండలాలకు చెందిన అధ్యక్ష, కార్యదర్శులు, డీలర్లు అధికారులను కలసిన వారిలో ఉన్నారు.

పింఛనుదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

కొవ్వూరు: రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులందరూ విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పెనుమాక జయరాజు సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి పింఛనుదారుడు తమ ఆధార్ నంబర్‌ను ఫోన్ నంబర్‌తో లింక్ చేయించుకోవాలన్నారు. నెట్ సెంటర్‌లలో గానీ, మీసేవ కేంద్రాల్లో గానీ ఈ-కేవైసీ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. త్వరితగతిన ఈకేవైసీ చేయించుకుని పత్రాలను సమర్పించాలని, అశ్రద్ధ చేస్తే పింఛను నిలిచిపోయే ప్రమాదం ఉందన్నారు.

కిశోర బాలికలకు శానిటరీ ప్యాడ్ల పంపిణీ

పెరవలి: కిశోర బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సోషల్ యాక్టివిస్ట్ వి.ఆశాజ్యోతి సూచించారు. పెరవలి ఉన్నత పాఠశాల్లో యుక్త వయసు విద్యార్థినులకు మంగళవారం సీహెచ్ హిమజా రెడ్డి హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో శానిటరీ నేప్కిన్‌లు అందించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు గుడ్ టచ్, బాడ్ టచ్, రుతు క్రమ సమస్యలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగోలు సీతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ప్రమీల కుమారి, ఉపాధ్యాయురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

రజక జన మహాసభకు తరలి కావాలి

నల్లజర్ల: ఈనెల 23న ఏలూరులో నిర్వహించే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన మహాసభకు గోపాలపురం నియోజకవర్గం లోని నాలుగు మండలాల నుంచి రజకులు భారీగా హాజరు కావాలని జిల్లా కార్యదర్శి జువ్వలపాలెపు సత్యనారాయణ (అన్నవరం) మంగళవారం కోరారు. జిల్లా సంఘ అధ్యక్షుడు చిలకపల్లి కట్లయ్య అధ్యక్షతన నిర్వహించే ఈసమావేశంలో రజకులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేసి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతారన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

చాగల్లు: మండలంలోని బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీలో డాక్టర్ కేఎల్ దేవి మంగళవారం గర్భిణులకు అన్నిరకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

తల్లీబిడ్డా రక్షణకు కిల్కారీ సేవలు

- కొత్త కార్యక్రమానికి కేంద్రం రూప కల్పన
- శిక్షణ పొందుతున్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలు



నల్లజర్ల పీహెచ్‌సీలో ఫోన్ ద్వారా శిక్షణ పొందుతున్న ఆరోగ్య, ఆశ కార్యకర్తలు

నల్లజర్ల: మాతాశిశు సంరక్షణ లక్ష్యంగా కిల్కారీ పేరుతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కొత్త కార్యక్రమానికి రూపకల్పన చేసింది. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై వారిని అప్రమత్తం చేసేందుకు దీనిని అందుబాటులోకి తెచ్చారు. ఈ విధానంపై ప్రస్తుతం ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

హలో.. అక్కా నేను మీ డాక్టర్‌ను మాట్లాడుతున్నారు. మీ ఆరోగ్యం ఎలా ఉంది? అనే ఆప్యాయమైన పలకరింపుతో గర్భిణులు, బాలింతలకు ఇకపై ఫోన్లు వస్తుంటాయి. గర్భిణులు, బాలింతలు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్ల వద్దకు వెళితే పేరు, వయసు, ఇంటి చిరునామా, సెల్‌ఫోన్ నంబర్, అంచనా ప్రసవ తేదీ వంటి వివరాలను ప్రభుత్వ ఆర్సీహెచ్ రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. గర్భం ధరించిన మహిళ నాలుగో నెల ప్రారంభం నుంచి కిల్కారీ సేవలు (ప్రతి తల్లీ ఆరోగ్య స్వీయ ఆరోగ్యసేవ) ప్రారంభం అవుతాయి. గర్భిణి చెప్పే సమాధానాల ఆధారంగా ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తారు. కరోనా సమయంలోను తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరైన అవగాహన లేక కొన్ని మాతృ మరణాలు సంభవించాయి. మరికొందరు పౌష్టికాహారం, రక్తహీనత లోపాలతో మృత్యువాత పడుతున్నారు. ఇకపై ఇలాంటి సమస్యలకు చెక్ పెడుతూ ప్రభుత్వం ఈ విధానాన్ని అమలులోకి తెచ్చింది.

72 వారాల పాటు సేవలు



గర్భిణిగా నమోదైన రెండో త్రైమాసికం నుంచి పిల్లలు పుట్టిన ఏడాది వరకూ ఏయే వారంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాల్లో వివరించే ఆరోగ్య సమాచారంతో 72 వారాల పాటు వారానికి ఒక ఆడియో చొప్పున వాయిస్ రూపంలో అందుబాటులోకి తీసుకు వస్తారు. ఫలితంగా మాతా,శిశు మరణాలు తగ్గడంతో పాటు సురక్షిత ప్రసవాలకు అవకాశం ఉంటుంది.

– విజయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్, నల్లజర్ల పీహెచ్‌సీ

గర్భిణిగా నిర్ధారణ అయినపుడే..



గర్భిణిగా నమోదైనపుడే వారి ఫోన్ నంబర్ తీసుకుంటారు. వారికి నేరుగా మహిళా డాక్టర్ నుంచి ఫోన్ వస్తుంది. తమకు అందిన వివరాల ప్రకారం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయించుకోవాల్సిన వైద్యం గురించి వైద్యుడు వివరిస్తారు. డాక్టర్ ఫోన్ చేసినపుడు గర్భిణి మాట్లాడడం కుదరకపోతే తిరిగి అదే నంబర్‌కు గర్భిణి ఫోన్ చేసి వివరాలు తెలుసుకునేలా ఈ విధానాన్ని రూపొందించారు. గర్భిణికి ఆండ్రాయిడ్ ఫోనే కాదు కీ ప్యాడ్ ఫోన్ ఉన్నా సరిపోతుంది.

– డాక్టరు తెల్లం గంగాధరరావు, పీహెచ్‌సీ డాక్టర్, నల్లజర్ల

విశ్వేశ్వరునికి శ్రీపుష్ప యాగోత్సవం



విశేష అలంకరణలో అన్నవరప్పాడులోని విశ్వేశ్వరస్వామి వారు

పెరవలి: అన్నవరప్పాడులోని విశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు సోమవారం రాత్రి ఘనంగా పుష్ప యాగోత్సవం నిర్వహించారు. స్వామి వారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ గర్భాలయాన్ని కూడా సుందరంగా అలంకరించారు. వందలాది మంది భక్తులు యాగోత్సవంలో పాల్గొన్నారు. వేద మంత్రాల మధ్య స్వామి, అమ్మవార్లకు పండితులు పూజలు నిర్వహించారు., అనంతరం 108 మంది దంపతులకు తాంబూలాలు అందించారు. 21 రకాల పిండి వంటలు, 18 రకాల పండ్లు సమర్పించారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ

నిడదవోలు రూరల్: నవ ధాన్యాలు వేసి భూమిని కలియ దున్నడం వల్ల పోషకాలు సక్రమంగా చేరి చీడపీడలను నివారించగలమని ప్రకృతి వ్యవసాయ విభాగం నిడదవోలు యూనిట్ ఎంటీ మహారాణి సూచించారు. కోరుమామిడి గ్రామంలో మంగళవారం నవధాన్యాల సాగుపై ఆ పంచాయతీ సర్పంచ్ అంబటి గోపమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాణి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో నవధాన్యాల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు అబ్బులు, నాగసుశీల, వెంకట్రావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

భూసారాన్ని పెంచేందుకు..

గోపాలపురం: భూ సారాన్ని పెంచేందుకు రైతులు నవధాన్యాల పంటలు వేయాలని ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వాదాలకుంట గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ వుండవల్లి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వ్యవసాయశాఖ ప్రకృతి విభాగం జిల్లా ప్రాజెక్టు అధికారి ఎం.తాతారావు మాట్లాడుతూ పంటలకు ఆవు మూత్రం, పేడ పచ్చిరొట్ట ఎరువులు వాడాలన్నారు. దీనివల్ల మొక్క చీడపీడలను తట్టుకుని వేరు అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వాదాలకుంట సర్పంచ్ జొన్నకూటి మనెమ్మ, పలువురు రైతులు, పంచాయతీ, వ్యవశాయ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



కోరుమామిడిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పెనకనమెట్టలో..

కొవ్వూరు: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తూ పెనకనమెట్టలో ర్యాలీ నిర్వహించారు. వరి కోతలకు ముందు చిరు ధాన్యాలు, నూనె గింజలు, పప్పు జాతి గింజలు, సుంగధ ద్రవ్యాలు, కూరగాయలు వంటి విత్తనాలను పొలంలో చల్లుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై ప్రచారం చేశారు. ప్రీ మాన్‌సూన్ డ్రై సోర్సింగ్ విధానంలో 30 రకాల విత్తనాలతో నేలతల్లి బాగు అనే అంశంపై బ్యానర్లు చేత పట్టుకుని ర్యాలీ నిర్వహించారు.ఏవో గంగాధర్, హార్టికల్చర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ప్రకృతి వ్యవసాయం కో–ఆర్డినేటర్ జె.హరీష, విద్యార్థులు పాల్గొన్నారు.

గోష్పాద క్షేత్రంలో అక్రమ నిర్మాణాలు ఆపాలి

- పలు హిందూ సంఘాలు, బీజేపీ నేతల విజ్ఞప్తి
- ఆర్డీవోకు వినతిపత్రం అందజేత

కొవ్వూరు: ఆధ్యాత్మికత పేరుతో పురాణ ప్రాశస్త్యం గల స్థానిక గోష్పాద క్షేత్రంలో జరుగుతున్న అనధికార నిర్మాణాలను నిలిపివేసి, ఇక్కడకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని గోవు, గోదావరి పరిరక్షణ సమితి, హిందూ చైతన్యవేదిక, బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వారు కొవ్వూరు ఆర్డీవో ఎస్.మల్లి బాబును కలసి వినతిపత్రం సమర్పించారు. రెవెన్యూ పాత రికార్డులు, ఆర్ఎస్ఆర్‌ల ప్రకారం ఇక్కడి ఏ స్థలం ఎవరికి చెందినదో నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు. ఇబ్బడిముబ్బడిగా కట్టడాల నిర్మాణం, ఫెన్సింగ్‌లు వేయడం వల్ల ఈ క్షేత్రం ఇరుకుగా మారిపోతోందన్నారు. ఈ క్రమంలో గోదావరి పుష్కరాలపుడు రాజమహేంద్రవరంలో మాదిరి ప్రమాదాలు సంభవించి భక్తులు ప్రాణాలు కోల్పోయే ముప్పు లేకపోలేదన్నారు. లాంచీల రేవు నుంచి గోష్పాద క్షేత్రానికి వెళ్లే మార్గంలో గోదావరి పవిత్రతకు భంగం కలిగించేలా జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణాలను నిలుపుదల చేయాలని కోరారు. గోష్పాద క్షేత్ర పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు, ఆధ్యాత్మిక వేత్తలతో కమిటీని ఏర్పాటు చేసి క్షేత్రం పవిత్రతను కాపాడాలని కోరారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిమి రాధాకృష్ణ, హిందూ ఐక్యవేదిక సభ్యులు వైకే శ్రీనివాస్, పరిమి హరిచరణ్, మడిచర్ల రామచంద్రరావు, కొండపల్లి రత్నసాయి, బీజేపీ రూరల్ అధ్యక్షుడు పెరుగు పోతురాజు తదితరులు ఆర్డీవోను కలిసిన వారిలో ఉన్నారు.

నేటి నుంచి 'ఉపాధి' సామాజిక తనిఖీ

- ఎస్సార్పీ ప్రసాద్ ఆధ్వర్యంలో బృందం ఏర్పాటు
- రూ.13.56 కోట్ల వ్యయంతో మండలంలో 320 పనులు

నల్లజర్ల: మండలంలో 2021–22లో చేసిన ఉపాధి హామీ పనులపై ఈనెల 22 నుంచి సామాజిక తనిఖీ చేపడుతున్నట్టు ఉపాధి ఏపీఓ సత్యనారాయణ తెలిపారు. ఇందుకోసం ఎస్సార్పీ జి.ప్రసాద్‌తో పాటు ఐదుగురు డీఆర్పీలతో కూడిన బృందం ఉపాధి హామీ కార్యాలయం నుంచి రికార్డులు తీసుకునే పనిలో ఉందన్నారు. కో–ఆర్డినేటర్ల సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తారన్నారు. మొత్తం 320 ఉపాధి పనులకు రూ.6.69 కోట్లు వేతనాలు గాను, రూ.6.87 కోట్లు మెటీరియల్ కాంపొనెంట్‌గాను ప్రభుత్వం అందించిందని తెలిపారు. ఈ మొత్తం రూ.13.56 కోట్లతో మండలంలోని 23 గ్రామ పంచాయతీ పరిధిలో చెరువుల్లో పూడికతీత, చెట్లకు ట్రెంచ్‌లు కట్టడం, మొక్కల పెంపకం, పంటబోదెలు, పుంత రోడ్ల అభివృద్ధి, సచివాలయ భవన నిర్మాణాలు, పాఠశాలల ప్రహరీలు, సచివాలయల వద్ద కమ్యూనిటీ టాయిలెట్లు, డ్రైన్ల నిర్మాణం వంటి పనులు చేపట్టామని ఏపీవో వివరించారు. వీటిపై సామాజిక తనిఖీ చేపడతామని ఎస్సార్పీ ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గ్రామసభలు మాత్రం జరగవన్నారు. ప్రజావేదిక కార్యక్రమాన్ని కూడా పీడీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో గాని, మండల కేంద్రంలో గాని నిర్వహిస్తారన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

గోపాలపురం: తల్లి పాల వంటి మాతృ భాషా దినోత్సవాన్ని వివిధ పాఠశాలల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని చెరుకుమిల్లి మండల పరిషత్ పాఠశాల్లో నిర్వహించిన వేడుకల్లో ఎంఈఓ జి. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాతృభాష విశిష్టత గురించి ఆయన విద్యార్థులకు వివరించారు. గ్రామానికి చెందిన పడమట బాలు అందించిన దేశ నాయకుల చిత్ర పటాలను ఎంఈఓ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం కె. ఝాన్సీరాణి, అనంతలక్ష్మి, సీఆర్పీ కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

'భువన విజయం' నాటిక ప్రదర్శన

తాళ్లపూడి: మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మలకపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో విద్యార్థులు 'భువన విజయం' నాటికను ప్రదర్శించారు. శ్రీకృష్ణదేవరాయులు పాత్రలో రేఖపల్లి వెంకట శ్రీను నటించారు. అష్ట దిగ్గజాలుగా మరో 8 మంది విద్యార్థులు చక్కగా నటించారు. హెచ్ఎం సీహెచ్ నాగేంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాళ్లపూడిలోని విజేత హైస్కూల్లో కూడా మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు.



తాళ్లపూడి మండలం మలకపల్లి హైస్కూల్లో విద్యార్థులచే భువన విజయం నాటిక ప్రదర్శన

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రు హైస్కూల్లో హెచ్ఎం కోటిపల్లి సరోజిని ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులైన యాళ్లబండి వెంకటస్వామి, షేక్ నాగూర్ మీరా సాహెబ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో పీడీ కోడే గంగాధరరావు, కోట రాంప్రసాద్, వి.అప్పలరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పెరవలి: అజ్జరం ప్రాథమిక పాఠశాల్లో హెచ్ఎం కె.కాశీవిశ్వనాథం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, పద్యాలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి ఊరేగింపు

నిడదవోలు రూరల్: మండలంలోని కాటకోటేశ్వరంలోని ఉమా కాటకూటేశ్వర లింగేశ్వరస్వామి ఆలయ 60వ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామివారిని మంగళవారం రాత్రి ఘనంగా ఊరేగించారు. కాళికాదేవి, తీన్‌మార్ డప్పులు, కోలాటం, బుట్టబొమ్మలు ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ కోసూరి భాస్కరరావు పర్యవేక్షణలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలి

ఉండ్రాజవరం: జగనన్న గృహ లబ్ధిదారులందరూ విధిగా ఇళ్లు నిర్మించుకోవాలని నిడదవోలు సబ్ డివిజన్ డీఈఈ ఎస్.చంద్రశేఖర్ అన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై స్థానిక డ్వాక్రా భవనంలో లబ్ధిదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం మోర్తలో జగనన్న లేఅవుట్‌ను చంద్రశేఖర్ సందర్శించి అప్రోచ్ రోడ్డు నిర్మాణంపై అధికారులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ.శ్రీనివాసు, హౌసింగ్ ఏఈ విక్టర్‌బాబు, ఏపీఎం రత్నకుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

నిడదవోలు రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా శ్రీకాకుళంలో ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ కోరారు. నిడదవోలు ఇందిరానగర్‌లో అభ్యుదయ పెయింటర్స్, ఆర్టిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహాసభల వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. యూనియన్ నాయకులు యల్లమెల్లి వరప్రసాద్, యలగాడ రాజ్‌పాల్, చైతన్య, విశ్వాస్‌రాజ్‌కుమార్, గుంటూరు సూరిబాబు పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం

తాళ్లపూడి: కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కాపెల్లి నారాయణరావు వైద్య ఖర్చుల నిమిత్తం మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ మంగళవారం ఆర్థిక సాయం చేసింది. ఆసంస్థ అధ్యక్షుడు జె.వెంకటేశ్వరరావు, సభ్యులు చేతుల మీదుగా రూ. 5 వేలు, రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య రూ.1000 అందజేశారు.